సౌదర్యం

1

బండి కదిల్తోంటే—

కాదు, బండిలోంచి రమాదేవి చెయ్యి ఊపుతూ పుట్టింటికి వెడుతున్నానని చెప్తోంటే శ్రీదేవి హృదయం చివుక్కుమంది. గుండె గతుక్కుమన్నది. గొంతు గురగుర లాడింది.

ఏం చెయ్యటానికి తోచక చటుక్కున ఇంట్లోకి వెళ్ళి కొత్తగా కుట్టించుకున్న జాకెట్టూ, ఇంత పసుపూ - కుంకం కాగితంలో పోసి చుట్టబెట్టేసి ఓ - క్షు అంగలో బండీ దగ్గరగా వచ్చి రమాదేవి చేతిలో ఉంచుతూ: 'తొందరగా వస్తావుకదూ!'

అతి ప్రయత్నంమీద వణుకుతూ, వణుకుతూ ఉన్న కంఠంతో అనగలిగింది శ్రీదేవి.

'ఇవన్నీ ఏవిటే, చాల్లే'.

పెదవులను ద్విధా విభజిస్తూ, బుగ్గల మీదకు మధ్యవేలూ, బొటనవ్రేలూ పోనిచ్చి నొక్కుకుంటూ ముక్కు మీదకు తర్జనీ నడిపింది, రమాదేవి

'ఇక్కడింక మన కెవరుంటారు గనకా! నీకు నేనూ, నాకు నువ్వూ ఇలాటి వేవో జరుపుకోకపోతే. త్వరగా తిరిగి రావాలి సుమా? రాకపోతే నా తోడే'

మరి నెమ్మదిగా పలికింది శ్రీదేవి కంఠం. రమాదేవి కొద్దిగా చకిత అయింది. చకిత అయినా నిబ్బరించుకుని:

'త్వరగానే వస్తానే, ఇంక దిగవు'

అని చెయ్యి పట్టుకుని దోసిట్లో బిగించి వదిలింది రమాదేవి. బండి నడుస్తూనే ఉంది. బండి ముంగు నడిచే రమాదేవి అన్నయ్య బండివాణ్ణి తొందర పెడ్తూనే ఉన్నాడు.

బండి సందుమలుపులోకి వచ్చేసింది.

ఆగిపోయింది శ్రీదేవి.

శ్రీదేవి కాదు శ్రీదేవి కాళ్లు ఆగిపోయినవి.

ఆమె కన్నులు మాత్రం నడుస్తూనే ఉన్నవి. రమాదేవి కన్నులు శ్రీదేవి ముక్కుపుటాలకు తల్లోసి లాగుతూనే ఉన్నవి. మల్లెమొగ్గలాంటి రమాదేవి మునిపళ్లు చిరునవ్వు కాంతులను జిమ్ముతూనే ఉన్నవి. ఆమె కన్నులలో ఏవేవో భావాలు ప్రవహిస్తున్నవి.

శ్రీదేవి అడుగు కదపలేకపోయింది.

అలానే నిలబడి చూస్తూన్నది. రెప్ప వెయ్యకుండా చూస్తూ నిలబడిపోయింది.

బండి వేగం హెచ్చి జోరుగా సాగిపోతూన్నది.

కొంతవరకూ రమాదేవి రూపం స్పష్టంగా కనిపించి, రానురాను స్పష్టాస్పష్టం అయి, అస్పష్టమయిపోయి బండిమాత్రం కనిపించి, కనిపించేబండిలో రమాదేవిరూపం ఉన్న ఊహమాత్రం మిగిలింది. బండి పెద్ద బజారులోకి మళ్ళిపోయింది.

"మాఘమాసం వెళ్ళేవరకూ రమాదేవిరాదు"

గొంతుక్కీ, పెదవులకీ మధ్య నలిగిపోయి శ్రీదేవి గజగజ ఊపేసిందా వాక్యం.

కనుగొలకుల్లో బిందువులు నిల్చినవి.

కొనసాగిన ముక్కు చివర ముత్యంలా నిలబడిందొక బిందువు.

ఉషశ్రీ

శృంగాటకంలో (నాలుగురోడ్లు కలిసే చోటు) మట్టమధ్యాహ్నం ఒంటిగా నిలబడ్డాననే స్పృహ వచ్చేసరికి నఖశిఖ పర్యంతం ముణుచుకుపోయింది.

చరాలున వెనుదిరిగి, నాలుగడుగుల్లో యింట్లోకివచ్చేసి, ధనాల్మని తలుపులు వేసేసి, పట్టె మంచంమీద వాలిపోయి తలగడాలో ముఖం ముంచేసింది.

అప్పుడప్పుడూ గాలికి కదిలే తలుపు చప్పుడు రమాదేవి తిరిగి వచ్చేస్తోందన్న భ్రమకు కారణమయి రెండుమూడుసార్లు నిరాశనే కలిగించింది.

కన్నీటితో తలగడా తడిసి ముద్దవకుండానే నిద్ర పట్టేసింది.

ఖచ్చితమయిన నిద్రే పట్టింది శ్రీదేవికి. లేకపోతే ఏదో ఓకల వచ్చేది. ఒక పేమిటి రెండుమూడు కలలు వచ్చేవి.

కలలో...

పుట్టింటికి వెళ్ళినట్టో,

వెళ్లటానికి ప్రయత్నిస్తున్నట్టో,

ఉన్నట్టుండి భర్త వెళ్లటానికి వీల్లే దంటారన్నట్టో,

అటూ, యిటూ కాకపోతే యింటిదగ్గర ఎవరూ కదలటానికి తీరికలేదు కనకనున్నూ, తమ్ముడు సరిగ్గా భోగినాటికే వస్తాడు కనుకనున్నూ భర్తతో బయలుదేరిరావటం కానీ, ఆయనకుతీరిక లేకపోతే స్వయంగా రైలెక్కి ఇక్కడ దిగమనో - అన్నయ్య ఉత్తరం వ్రాసినట్టో - అలా వ్రాసిన ఉత్తరాన్ని పదేపదే చదువుకుంటూ కులుకుతూ, పొంగిపోతూన్నట్టో ఎట్టెట్టో కలవచ్చేది. అదీ కాకపోతే అన్నయ్యే స్వయంగా వచ్చినట్టూ, రావటంకూడా తెల్లవారుఝాం బండిలోదిగి, తాను ధనుర్మాసపు రంగవల్లులు దిద్దుతూండగా ప్రత్యక్షమయినట్టూ, ఆ మధ్యాహ్నమే భోజనాలదగ్గర 'బావా,

★ సౌదర్యం ★

పెద్దవంటుక్కా మీ యిద్దర్నీ తీసికెడదామని వచ్చాన్రా' అనగా ఆయన మున్బావంగా ఊరుకో నేసరికి తనగుండె గుభేలుమన్నట్టూ, ఆ తరువాయి తన అనురాగాన్ని అంతనూ తనలోనే ఉంచుకొని మామూలు ప్రకారం తమలపాకులకు సున్నం రాసి చిలకలు చుట్టి యిస్తూంటే, నిర్లక్ష్యంగా మున్బావంగా ఆయన పేపరు చదువుతూనే కూర్చుని, రాత్రి పొద్దుపోయాక మిద్ది గదిలోకి వెళ్ళి గోడమూలనున్న చాప పరుచుకుని పైటచెరుగే తలక్రింద పెట్టుకొని పడుకున్నా నిద్రపట్టక బాధపడుతున్నా, ఆయనగుర్రుకొట్టి నిద్రపోతున్నట్టూ.. యిలా యిలా - యిలా - ఎలానో ఓలా కలలొచ్చేవి. రావలసిన కల ఏదీరాకుండానే అవాఙ్మానస గోచరానుభూతి పరంపరలను ప్రసాదించే స్వర్గసుఖతుల్యమయిన నిద్రలో ఉన్నది శ్రీదేవి.

2

శ్రీదేవి ఉలిక్కిపడి లేచింది.

లేచిన శ్రీదేవి లేస్తూనే పైటచెంగు సరిజేసికొని, చెంగుతోనే ముఖం తుడుచుకుని, దొడ్లో నూతి పళ్ళెం దగ్గరకు వెళ్ళి శుభ్రంగాముఖంతోముకుని, కాళ్ళూచేతులూ కడుక్కుని, అద్దం ముందు నిలబడి రేగిన ముంగురులు దువ్వెనతో సరిజేసుకొని, చిన్న కుంకుమ బొట్టుపెట్టుకొని సరిదిద్దుకుంటూండగా వీధి తలుపు దగ్గర ఉలికిడయింది.

'అన్నయ్య!'

అనుకుంటూ, లేడిలా గదిలోంచి వసారాలోకి వచ్చి తలుపు తీసింది.

'ఊ... హూ'

నీరసం పడింది శ్రీదేవి హృదయం.

పొరుగు వాటాలో ఉన్న సుబ్బలక్ష చెల్లెలు సుశీల.

"మంచి నిద్రలో ఉన్నట్టున్నారు అత్తయ్యగారు, ఇందాకా ఎన్నిసార్లు పిల్చినా పలక నే లేదు. మా అక్క ఈ చెమ్చాతో నాలుగు చెమ్చాల కాఫీ పొడుం యిమ్మందండీ. సాయంకాలం బావ లేగానే..." అంటూ సుశీల అడుగులువేసి వచ్చి కుర్చీమీద కూర్చుంది.

శ్రీదేవి ఏమీ మాట్లాడకుండానే సుశీల చేతులోంచి చెమ్చా, గిన్నీ తీసికొని వంటింట్లోకి నడిచింది.

వంటింట్లోకి వెడుతూండగా ఏదో బండి తన గుమ్మంముందు ఆగుతుందని, ఆగుతుందనేమిటి! ఆగిందనే అనిపించింది.

అనిపించినంతలో బండీవచ్చి ఆగుతుందా?

ఆగదని తెలిసికోలేనంత అమాయకురాలు కాదు శ్రీదేవి.

అమాయకురాలు కాదుకాని అంతవరకూ శ్రీదేవి ఆలోచించటానికి అంగీకరించదు.

బండివచ్చి ఆగాలనేది శ్రీదేవి ఆశ.

ఆశకూ ఆలోచనకూ, ఆలోచనకూ అది అవటానికీ ఎంతదూరం ఉందో!

'రమత్తయ్యగారు వెళ్ళిపోయినట్టున్నారు. ఇంక మీకేం తో చదనుకుంటాను.'

భడవ!

వచ్చింది వచ్చినట్టూ ఆగక, తనపని తాను చూసుకోక, ఈ గుంటనక్కకి అనూ టెందుకూ?

మాట కాస్తా అని ఊరుకుందా!

ఊరుకుంటే అది సుశీలే కాదు, అనా ఊరుకునేది! హమ్మా!

అవులిస్తే పేగులు లెక్కెట్టే భడవ!

సరిగ్గా శ్రీదేవి తనవైపు చూసేసరికి చిలిపిగా కళ్ళుమూసి నాలుక కొరుక్కుంది.

శ్రీదేవి గుండెలో గుచ్చుకుంది.

ఆపిల్లమీద తన కేపాటి ధికారం ఉన్నా చీల్చి చెండాడి, మాడ్చి మామాయి వంచేసేది. అంతా చెయ్యకపోయినా చేసిన ట్టనిపించగలిగేది.

"నాలుగుచెమ్చాలు చాలా ... ఇంకో రెండు..."

నాలుగోచెమ్చాతీస్తూ శ్రీదేవి అడిగింది.

కాఫీ పొడుం ఎన్ని చెమ్చాలు కావాలో సుబ్బలక్ష్మయ్యకు తెలుసు. తెలిసినన్ని చెమ్చాలూ తెమ్మని పంపింది సుబ్బలక్ష్మయ్య. సుబ్బలక్ష్మయ్య చెప్పినట్టూ చెప్పేసింది సుశీల. అంతకుమించి ఒక్క రవ్వకూడా శ్రీదేవి ఇవ్వనవసరం లేదు. ఇవ్వటమే కాదు, ఇంక ఆ విషయమై ప్రసంగించటం అనవసరం. అనవసరం కనకనే సుశీలకు చిర్రు చికాకువచ్చింది.

"అయిదో చెమ్చా డబ్బాలోకి పోనివ్వనక్కర్లేదండి అత్తయ్యగారూ! అసలు యింకోగంటలో బావ ఎలాగూ తెస్తాడు. అయినా ఆయన వచ్చే వేళకు ... తిరిగితిరిగి వస్తాడుకదూ! వెధవది... ఆఆఫీసు ఎక్కడో జగన్నాథపురంలో తగలేశారు. మనమేమో ఈమూల గాంధీనగరంలో ఉన్నాం. రోజూ సిటీబస్సుకి వేసపోనూ, వేడరానూ ఎక్కడ తగలేస్తాం. తగలెయ్యనూవచ్చు జీతం సరిపోతే...

"ఈశ్రూటుకు ఈ పొడుం అప్పుచేసి కాఫీ పెట్టకపోతే ఏం మునిగిపోతుందే అని అడిగానుసుమండీ. కస్సుమని మీద పడింది. పడి 'ఊరుకుందా! నీకేం తెలుస్తుందే. రేపొద్దున్న నీ మొగుడు కాపురాని కొచ్చాక .... ఏమిటో అలాగే నాలుగూ అనేసింది. ఏం చెయ్యమంటారూ?' 'పెద్దలు చెప్పినట్టు వినవలెను' అన్నారు కనక..." అని వాక్యాన్ని మధ్యలోనే త్రుంచేసి, రెండుచేతులూ కట్టుకుని మూతి ముణిచేసి బెదిరిపోతూన్నట్టు అభినయిస్తూ, అభినయిస్తున్నట్టు తెలిసేట్టూజేస్తూ ఒక్క క్షణం నిలబడి ఫకాల్న నవ్వేసి, కాఫీ పొడుం తీసుకుని జర్రున జెర్రిపిల్లలా జారేసింది. ఊచలా దూసుకుపోయే సుశీలవైపే చూపులు నిలిచింది శ్రీదేవి. నిజానికి సుశీలకేం తెలుసూ? శ్రీదేవి హృదయంలోని బాధ శ్రీదేవి కే తెలుసు. గడపదాటేసిన పిల్ల కొంప మునిగిపోయినట్టూ వెనుదిరిగి వచ్చి: "అత్తయ్యగారూ, రాత్రి ఎనిమిదింటికి రేడియోలో మంచి నాటిక ఉంది. రమత్తయ్యగారింట్లో విందాం. అత్తయ్యగారు లేకపోయినా మావయ్యగార్ని నే నడుగుతా."

అంటూనే శ్రీదేవి సమాధానం వినకుండా చక్కాపోయింది. వాకిట్లో మడత మంచం వాల్చుకుని, కాళ్లు కిందికి వ్రేలాడేసి మోచిప్పలమీద మోచేతులుంచి అరచేతుల్లో చిబుకం, బుగ్గలు బిగించుకుని శూన్యంలోకి చూస్తూ కూర్చుంది.

3

మూడో సంక్రాంతి!

గతించిన రెండు సంక్రాంతులూ కులాసాగానే వెళ్ళాయి. వెళ్ళాయంటే వెళ్లాయంతే!

కులాసాగా, హాయిగా వెళ్లాయా అంటే, వెళ్ళాయనే అనుకోవాలి. అవి వెళ్ళిపోయాయి కనుకనూ... మళ్లీ రావు కనకనూనూ.

అప్పట్లో కూడా మనస్సు చివుక్కుమందేమో! ఏమో అంత గుర్తులేదు శ్రీదేవికి.

అదీకాక, అప్పటికింకా వదినమీద కోపం పోలేదేమో, ఆ దృష్టే ఉండేది కాదు.

ఇప్పుడు అల్లాకాదు.

ఇప్పుడూ అలానే ఉండేది.

ఉండేది కానీ, రమాదేవి అన్నయ్యవచ్చి రమాదేవిని తీసికెళ్ళటంతో వచ్చి పడింది బాధ. అన్నయ్యగారు వచ్చి ఎంతో ఆప్యాయంగా రెండురోజులుండి చెల్లెల్ని పుట్టింటికి తీసికెళ్ళేటప్పుడుండే అనుభూతి శ్రీదేవి ఎరగదు. కాని రమాదేవి ముఖంలో అదంతా చూచేసరికి రెండు కన్నీటి చుక్కలు జారి చిటికినవ్రేలి ఉంగరంమీదనుంచి ఒడిలోకి ప్రసరించినవి.

దుఃఖం పొంగి వచ్చింది.

అకాలనెరపు, బట్టను ఆపుటకు
కాష్మీర్-కుసుమం
మీ ఇష్టమైన నూనెలో నానవేయండి
యునైటెడ్ కెమికల్ వర్క్స్, బందరు వీధి, మద్రాసు-1. విజయవాడ.
చర్మ ఉపద్రవములకు, అపాయములకు
అత్యుత్తమమైన సుగంధ మలాము
సాంటలక్స్
గజ్జి, పుండ్లు, కాటులు, మొటిమలు

జలజల రాలాయి బాష్పకణాలు.

విలవిలలాడింది మనస్సు.

వెలవెలపోయింది ముఖం.

గిరగిర తిరుగుతోంది అసలు కథ.

* * * *

'పొద్దున్నే పదింటికి నాలుగు మెతుకులు కొట్లో వేసుకు వెళ్లి ఈ పొద్దుదాకా ఆఫీసు పని చూసుకొచ్చిన మనిషికి కాస్తంత కాళ్లు కడుక్కుందికి చెంబెడు నీళ్లివ్వలేవుటే, ఆయనంతటి ఆయన చేదతో తోడుకోవాలా చాల్చాల్లే, రేపోమాపో కాపరానికి వెళ్ళబోతున్న దానివీ ... ఆపాటి తెలవొద్దుటే శ్రీదేవీ!"

అంది వదిన—అద్దంముందునిలబడి రాత్రి ఏడింటికి అలంకారం సాగించుకుంటూన్న శ్రీదేవితో.

బొడ్డులోంచి తారాజువ్వలా దూసుకొచ్చిన కోపం దట్టింపు సరిగాలేని చిచ్చుబుడ్డిలా ముక్కు చివరదాకా వచ్చి చీదేసింది.

శ్రీదేవి సినిమాకెళ్లి వారం రోజులయింది. మళ్ళీ వారానికీనాడు బయల్దేరబోతుంటే వదిన కెంత బాధో.

అసలు ఆవిడకు శ్రీదేవి సినిమాకు వెడుతున్నట్టు ఎలా తెలుసో? ఎందుకు తెలీదూ!

రాత్రి ఏడుఘంటల వేళ పుట్టింటి దగ్గరున్న పడుచుపిల్ల చాకింటి మడతలు సింగారించి అలంకారాలు సాగిస్తుంటే యింకెక్కడికి వెడుతుందనుకుంటారేమిటే?

అదే వదిన బాధ.

శ్రీదేవి సినిమాకు వెళ్ళటం వదినకు బాధకాదు కాని అన్నయ్యకష్టార్జితాన్ని యిలా ఖుషారా చేయటం ఆవిడ కిష్టం లేదు.

హుమ్మ్!

వదినకెంత దుర్బుద్ధి.

అన్నయ్యా, తనూ స్వయానా ఓ తల్లి కడుపున పుట్టిన బిడ్డలు.

మరి వదిన?

వదినంటే అన్నయ్య పెళ్లాం!

అంతగా వస్తే మావయ్య కూతురు.

అంతేకదా.

మావయ్య కూతురికే అన్నయ్య సంపాదన మీద అధికారం ఉంటే అన్నయ్యతోపాటు అమ్మ కడుపున బుట్టిన తనకెంత స్వాతంత్ర్యం ఉండాలి?

అదీకాక అన్నయ్య సంపాదనలో తను చేసే దుర్వినియోగం ఏమీలేదే. తీరాచూస్తే వారానికోసారి సినిమా అంతేగా.

మహా అయితే వారానికంతకూ కలిపి అర్ధో, రూపాయో పువ్వుల ఖర్చు.

ఆ ఖర్చు వదినకీ ఉండేది; ఇప్పుడంటే బాలింతరాలు కనకా...

పోతే మొన్నటి దాకా హైస్కూల్లో తన చదువుక్రింద అన్నయ్య ఖర్చుపెట్టాలే. ఈ ఏడాదినుంచి అది మిగులేగా. అయినా మరి వదినకెందుకో అక్కసు.

మహాఉంటే - యింకా ఈ కొంపలో - ఓ నెల ఉంటేను, రెణ్ణెల్లుంటేను. ఆ తరువాయి కూడా వచ్చి వదిన తన స్వేచ్ఛను అరికడుతుందా? హాయిగా తనూ, తనభర్తా కలిసి సైకిల్ రిక్షామీద వారానికి మూడు సినిమాలు చూస్తారు. అప్పుడు కాని వదినకి బుద్ధిరాదు. అనుకుంటూనే శ్రీదేవి వీధిలోకి నడిచింది.

ఇంత ఆలోచించిన శ్రీదేవికి వదిన తననేమన్నదో అర్థంకాలేదు. అనవసరంగా వదినమీద లేనిపోని అపోహలు కల్పించుకుంది.

* * * *

ఇంకోసారి...

"ఆయన చేతులు కాల్చుకుంటుంటే చూస్తూ కూర్చోకపోతే ఈపూటకి కాస్త నువ్వు వండి వార్చరాదుటే."

అంది జ్వరంతో మంచంమీదున్న వదిన.

చీకటి జువ్వలా వళ్ళంతా పాకింది కోపం.

స్కూల్ ఫైనల్ ప్యాసయిన శ్రీదేవిని.. రేపో, మాపో కాపురానికి పోబోయే శ్రీదేవిని...

తన సంతానానికి వండిపెట్టమంటుందా వదిన? ఎంత లోకువైపోయానూ' అనుకుంది శ్రీదేవి.

అసలిన్నాళ్లూ వదినకు జవాబివ్వకుండా వదలటమే యింతవరకూ తెచ్చింది.

ఉడకేసి పారేసిందాకా ఉండి యింట్లో ఉన్న గచ్చకాయకూ, నత్తకాయకూ కలిపి కంచాల్లో పెట్టి, చేతులూ మూతులూ కడిగి ఎంగిళ్లు ఎత్తేసరికి రాత్రి పదవుతుంది. అప్పుడింక ఆకలేం ఏడుస్తుంది? నిద్దరేం పడుతుందీ?

ఈ చాకిరీ అంతా ఎవడు చేస్తాడు వీళ్లకు.

తక్షణం - నిలబడ్డపళంగా - బయలుదేరి రమ్మని 'ఆయన'కు టెలిగ్రాం యిద్దామనుకుంది. మామూలు టెలిగ్రాం ఏమిటీ, ఎక్స్‌ప్రెస్ యిద్దామనుకుంది.

అనుకుందంతే!

'నిద్రపోతున్నావేమిటే శ్రీదేవీ, అయ్యో, రెండు మెతుకులు తినేసి పడుకోవే, వేసంకాలం రాత్రి నీరసంకూడా వస్తుంది' అంది వదిన.

ఎంత చులకన!

తన గదిలో తాను కూర్చుని నవల చదువుకుంటూంటే, యింకా మేజామీద అలారం టైంపీస్ లో చిన్నముల్లు ఆరుదాటినా పెద్దముల్లు తొమ్మిదిమీదుండగా 'నిద్రపోతున్నావా?' అని అడుగుతుందా. ఎంతలోకువ కట్టేసింది.

ఈసారి ఊరుకుని ఏదో ఓజవాబివ్వాలి.

ఓజవాబేం ఖర్మ!

మళ్లీ వదిన పెదవి కదలకుండా చెయ్యాలి.

'ఒరే బాబిగా, అత్తయ్య నిద్రపోతున్నట్టుంది, లేపి తీసికొచ్చి మీరిద్దరూ ముందు తినేయండి'

ఈమాట వదిన గొంతులోంచి ఎంత నీరసంగావచ్చిందో అంత కారంగానూ తగిలింది.

ఛ్రున కుర్చీలోంచి లేచి నిలబడింది.

వేళ్లు విరుచుకుంది.

మూతి ముప్పైమూడువిరుపులు విరిచింది.

రుసరుసలూ - విసవిసలూ సాగనిచ్చింది.

కోపం ఉరకలేవేసి, నురగలున్నూ కక్కింది.

ఆ ఆవేశంలో వంటింటి గుమ్మందాకా వచ్చి, కంఠ పూర్తిచేసుకుని:

"రేపు తొమ్మిది గంటల బండికి నన్ను పంపించెయ్యరా. ఆయన్ని స్టేషన్‌కురమ్మని టెలిగ్రాం యియ్యి' అంది శ్రీదేవి.

తెల్లబోయాడన్నయ్య.

ఒక్క క్షణం మాటే ఆడలేకపోయాడు. ఆడలేకపోయినా శ్రీదేవికోరిక నెరవేరింది.

* * *

నిజానికిప్పుడాలోచిస్తుంటే...

అమ్మపోయినప్పట్నుంచీ, ఒక్కగానొక్క చెల్లెల్నికదా అని అన్నయ్య ఎంతో యిదిగా పెంచాడు. వంటిమీద ఈగవాలితే సహించేవాడు కాదు. వదినని కూడా ఏమీ అననిచ్చేవాడు కాదు. అన్నయ్య ఏనాడూ తన యిష్టానికి వ్యతిరేకం చేయలేదు. వదినమాత్రం! శ్రీదేవి బండెక్కుతూంటే వదిన అంది:

"ఇన్నాళ్ళూ నిన్ను నా చెల్లెల్లా చూసుకున్నాను. చిన్నతనంచేత నీ కర్థంకాక కోపంతో వెడుతున్నావు. నువ్వు ఎప్పుడు రాదలచుకున్నా నీ కభ్యంతరంలేదు."

ఈ వాక్యంతో శ్రీదేవి శరీరం నిండా తేళ్ళూ, జెర్రులూ పరువులు తీసినవి. పరువులుతీసి ఊరుకోలేదు, కూడుపట్టుమీద ఒక్కపోటు పొడిచేశాయి.

గిర్రున తిరిగింది కన్నీరు.

అన్నయ్యా! వదినా?

శ్రీదేవి రాత్రి జనతాకు వెళ్ళటానికి బెడ్డింగు సర్దుకుని భర్తతో చెప్పినప్పుడు అతని వదనంలో చిరునవ్వు ప్రసరించింది.

★

శ్రీమదాంధ్ర

మహాభారతము

ఉద్యోగపర్వము

వెల రూ. 1-0-0

ఆంధ్రగ్రంథమాల, మదరాసు-1.